సాక్షి వనపర్తి

శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఉత్సాహంగా..
పాలమూరులో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸



అద్దె భవనాల్లోనే..
చిన్నంబావిలో ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

వివరాలు11లో ▸

గరిష్టం/కనిష్టం
27.6 /20.5

వాతావరణం
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వంతెన నిర్మాణానికి సహకరించండి : ఆర్డీఓ



మదనాపురం: ఊకచెట్టు వాగు వద్ద కొనసాగుతున్న వంతెన నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్డీఓ సుబ్రమణ్యం కోరారు. శుక్రవారం వంతెన పనులను ఆయన పరిశీలించి భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. డంపింగ్ పనులకు ఆటంకం కలిగించవద్దని.. ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందిస్తామని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అబ్రహం లింకన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల హామీలు నేరవేర్చాలి



వనపర్తి రూరల్: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ప్రగతిశీల గ్రామపంచాయతి కార్మిక సంఘం టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ కోరారు. శుక్రవారం తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో కార్మికులు జిల్లాకేంద్రంలోని మర్రికుంట పాలకేంద్రం నుంచి పంచాయతీ రాజ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, టీయూసీఐ జిల్లా నాయకుడు గణేష్ అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథులుగా పుట్టా ఆంజనేయులు, అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చాలన్ ద్వారా చెల్లింపులు జరపాలని కోరారు. రెండో పీఆర్సీ పరిధిలోకి సిబ్బందిని తీసుకురావాలని, జీఓనంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. జీఓనంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని.. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా, అర్హులైన సిబ్బందికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తూ.. మృతిచెందిన, అనారోగ్యం బారిన పడిన కార్మికుల ఇళ్లలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి నిక్సన్, ఏదుట్ల, కురుమయ్య, సుబ్బయ్య, కరీం, అనీఫ్, శ్రీను, దాసు, ఎల్లయ్య, పుష్ప, మధు, గోవిందమ్మ పాల్గొన్నారు.

వ్యథసాయమే..!



- పత్తి రైతులను ముంచిన భారీ వర్షాలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వరి సాగు
- తెల్ల బంగారానికి దక్కని మద్దతు.. మెరిసిన వరి ధరలు
- ముందుకుసాగని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలు
- 24 వేల మందికి మాఫీకాని రుణం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ రంగంలో రైతులకు మిశ్రమ ఫలితాలు లభించాయి. వరి రైతులు కొంత లాభపడితే.. పత్తి రైతుకు మళ్లీ నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది వర్షపాతం సాధారణానికి మించి ఎక్కువగా ఉండటం, సన్న ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ధర ప్రకటించిన నేపథ్యంలో రైతులు వరి సాగు వైపు ఎక్కువగా మొగ్గచూపారు. మరోవైపు భారీ వర్షాలు, తెగుళ్ల నేపథ్యంలో ఈ ఏడాది పత్తి దిగుబడి బాగా తగ్గింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఈ ఏడాది వరి సాగు పెరగ్గా, పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. మిగతా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో రైతులు గతేడాది కన్నా ఈసారి వానాకాలంలో పత్తి పంటను అధికంగా సాగుచేశారు.

జిల్లాల వారీగా వరి, పత్తి కొనుగోళ్లు

జిల్లా	వరి (మెట్రిక్ టన్నులు)	పత్తి (క్వింటాళ్లలో)
మహబూబ్‌నగర్	85 వేలు	1,02,408
నాగర్‌కర్నూల్	3.10 లక్షలు	8,67,346
వనపర్తి	1,74,603	సీసీఐ కొనుగోళ్లు లేవు
జోగుళాంబ గద్వాల	3.50 లక్షల	45,296
నారాయణపేట	82,051	1,10,236

వరి, పత్తికే ప్రాధాన్యం..

ఉమ్మడి జిల్లాలోని రైతులు అధికంగా వరి, పత్తి పంటలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలో గతేడాది కంటే ఈసారి వరి, పత్తి పంటలను అధికంగా సాగుచేశారు. మహబూబ్‌నగర్‌లో ఈసారి వరి 20 వేలు, పత్తి 5 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది. నారాయణపేటలో గతేడాది కంటే 10 వేల ఎకరాల్లో రైతులు అధికంగా వరి సాగు చేశారు. ఇక్కడ అధికంగా 50 వేల ఎకరాల్లో కందిపంట సాగవుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది 1,23,019 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి 1,46,253 ఎకరాలకు పెరిగింది. అలాగే గతేడాదితో పోల్చితే పత్తి సాగు విస్తీర్ణం 23 వేల ఎకరాలు తక్కువగా నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈసారి పత్తిసాగు 70 వేల ఎకరాల వరకు తగ్గగా, వరి పంట విస్తీర్ణం 9వేల ఎకరాలు ఎక్కువగా నమోదైంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2024లో సాగైన వానాకాలం పంటల వివరాలు(ఎకరాల్లో)

జిల్లా	పత్తి	వరి	మొక్కజొన్న	వేరుశనగ	కందులు	జొన్నలు
మహబూబ్‌నగర్	85,637	1,92,828	28,259	36.29	7,956	11,730
నాగర్‌కర్నూల్	3,53,655	1,46,253	90,611	1,784	19,451	7,529
జోగుళాంబ గద్వాల	1,46,128	89,980	12,812	7,562	22,528	95.18
వనపర్తి	17,421	1,87,544	11,110	10,048	3,954	775
నారాయణపేట	1,82,826	1,69,425	60	6,989	50,886	650

వ్యవ'సాయానికి' కలసిరాని కాలం..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తిపంట సాగు చేస్తున్నారు. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 3.50 లక్షలు, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 2 లక్షల ఎకరాలకు మించి పత్తి సాగవుతోంది. మహబూబ్‌నగర్‌లో 80 వేలు, వనపర్తిలో తక్కువగా 17 వేల ఎకరాల్లోనే రైతులు పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి పత్తి పంటకు సరైన ధర లేక రైతులు నిరాశలో ఉన్నారు. ఈసారి సీసీఐ ఆధ్వర్యంలో క్వింటాల్‌కు రూ.7,200 నుంచి రూ.7,527 వరకు కొనుగోలు చేస్తుండగా, ప్రైవేటు దళారులు కేవలం రూ.6 వేలకే కొనుగోలు చేశారు. సీసీఐ కేంద్రాల్లో తేమశాతం, కాయ నిబంధనలతో ఎక్కువ శాతం రైతులు ప్రైవేటుకే తమ పత్తిని అమ్ముకున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జాప్యం కారణంగా చాలావరకు రైతులు ప్రైవేటు దళారులకు విక్రయించారు. ఫలితంగా సన్నరకం ధాన్యానికి రూ.500 చొప్పున వచ్చే బోనస్ ధరను కోల్పోయారు. ఈసారి తగ్గిన దిగుబడి, సరైన ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా కలసిరావడం లేదని రైతులు చెబుతున్నారు.

రివైండ్ 2024

గిట్టుబాటు కాలేదు..



నాకున్న ఐదెకరాల్లో ఈసారి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేశాను. వర్షం దెబ్బకు దిగుబడి తక్కువగా వచ్చింది. ఎడతెరిపిలేని వర్షాలకు పత్తికాయ ఎర్రబడి సగం దిగుబడే చేతికి అందింది. మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6,300 చొప్పున అమ్ముకున్నా. ఈసారి మార్కెట్లో తగిన ధర లేకపోవడంతో గిట్టుబాటు కాలేదు. పంట కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు.

– ఆలేటి బంగారయ్య, రైతు, గట్టురాయిపాకుల, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

బోనస్ రాలేదు..




తొమ్మిది ఎకరాల్లో సన్నరకం వరి ధాన్యం సాగు చేయగా 219 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ నెల 7న కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఆరు రోజుల తర్వాత నా బ్యాంకు ఖాతాలో బోనస్ లేకుండా అసలు రూ.5,08,299 జమ చేశారు. మూడు రోజుల్లో బోనస్ వస్తుందని అధికారులు చెప్పారు. కానీ, 15 రోజులు అవుతున్నా బోనస్ జమ కాలేదు. బోనస్ కింద రూ.1,09,500 రావాలి.

– బాల్‌రెడ్డి, రైతు, రాకొండ, మరికల్ మండలం, నారాయణపేట జిల్లా

ముందుకుసాగని 'పాలమూరు' పనులు..

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ మొదటి మోటారును ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మిగతా పనులు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లా రైతులకు వరప్రదాయినిగా నిలిచే ఈ ప్రాజెక్టు పనులు ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన తదితర రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికావచ్చినా కీలకమైన టన్నెల్, మోటార్ల బిగింపు పనులు పూర్తికాలేదు. వివిధ స్టేజీల్లో చేపట్టిన పాలమూరు ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయిలో మోటార్ల బిగింపు పూర్తయితేనే సాగునీరు అందనుంది. రిజర్వాయర్ల నుంచి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు, ఫీడర్ చానళ్ల నిర్మాణంతో రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో పాలమూరు ప్రాజెక్ట్‌కు కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే కేటాయించడం, నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడం ప్రాజెక్ట్ భవితవ్యంపై నీలినీడలు నెలకొన్నాయి.



అసంపూర్తిగానే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు

రైతు భరోసాపై నిరాశ..

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఏడాది పాలన పూర్తయ్యింది. అయితే ఈ ఏడాదిలో రైతు భరోసా కింద రైతులకు అందించే పెట్టుబడి సాయం అందలేదు. ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో ఖరీఫ్, రబీ పంటల సాగుకు పెట్టుబడి సాయం అందకపోవడంతో ఉమ్మడి జిల్లాలో రైతులు నిరాశ చెందారు. రుణమాఫీ ప్రక్రియ కింద బ్యాంకు పంట రుణాలను ప్రభుత్వం నాలుగు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమచేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 3,14,678 మంది రైతులకు రుణమాఫీ కింద పంట రుణాలను మాఫీ చేసింది. ఇంకా రుణమాఫీ కాని వారు మరో 24 వేల మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.



అమరచింత కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు (ఫైల్)

నల్లబ్యాడ్జీలతో '104' ఉద్యోగుల నిరసన

అమరచింత: బకాయి వేతనాలు చెల్లించాలంటూ జిల్లాలోని ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న 104 ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వర్తించారు. అమరచింత డీఎంఆర్‌ఎం ఆస్పత్రిలో సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ రాజు మాట్లాడుతూ.. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 4న రూ.12.56 కోట్లు విడుదల చేసినా నేటి వరకు ఉద్యోగస్తులకు చేరలేదని వివరించారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు.



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న '104' సిబ్బంది

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్

వనపర్తి: దేశ ఆర్థిక సంస్కరణల ఆద్యుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ఆమోదింపజేశారని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా సేవలందించారన్నారు. 33 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందడం బాధాకరమని వివరించారు.

నిజాయితీ రాజకీయాలకు దిక్సూచి..

వనపర్తి టౌన్: నిజాయితీ రాజకీయాలకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నిదర్శనమని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయచందర్ అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయం, జిల్లాకేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మన్మోహన్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఆర్బీఐ గవర్నర్‌గా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా సమర్థవంతమైన సేవలు అందించారని గుర్తుచేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం, సమాచార హక్కు చట్టం ఆయన హయాంలోనే వచ్చాయన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు సంస్కరణలతో ఆర్థికంగా దేశాన్ని గట్టెక్కించారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీ, దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్కాకుల సతీష్, నందిమళ్ల చంద్రమౌళి, కదిరె రాములు, యాదయ్య, ఎల్‌బీసీ కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైద్యం.. అందని దైన్యం

అమరచింత డీఎంఆర్‌ఎం ఆస్పత్రిలో సేవలు అంతంత మాత్రమే

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- రక్తపోటు, మధుమేహం మందులు సైతం కరువు
- ప్రమాదానికి గురైన 108 వాహనం.. మరమ్మతుకు నోచుకోని వైనం



అమరచింతలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రి

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకం, సౌకర్యాలు కల్పించడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. అన్ని హంగులతో డీఎంఆర్‌ఎం ట్రస్ట్ నిర్మించిన ఆస్పత్రిని ప్రభుత్వానికి అప్పగించినా.. ఇప్పటి వరకు పీహెచ్‌సీగా ప్రకటించడం లేదు. ఆస్పత్రికి 108 వాహనం మంజూరై ఏడాదిగాకముందే అది ప్రమాదానికి గురైంది. మూడు నెలలుగా ఆస్పత్రి వద్ద వాహనం కనిపించడం లేదు. అత్యవసర సమయాల్లో ఇతర మండలాల్లోని 108 వాహనంపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

రూ.75 లక్షలతో..

ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు రూ.75 లక్షలతో డీఎంఆర్‌ఎం ట్రస్ట్ సొంత భవనం నిర్మించి ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. 2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి ప్రారంభించగా ట్రస్ట్ నియమించిన వైద్యుడు సేవలు అందించారు. ఎస్వీఎస్ ఆస్పత్రి సహకారంతో కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తూ వచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2014లో ఆస్పత్రిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే 13 ఏళ్లుగా స్వీపర్లు ఇద్దరికి ట్రస్ట్ నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన ఆస్పత్రిని ప్రభుత్వపరం చేశామని వైద్యులు, సిబ్బందిని నియమించాలని పలుమార్లు ప్రభుత్వం, అధికారులకు విన్నవించారు.

ఇదీ పరిస్థితి..

మండలంలో 35,716 జనాభా ఉంది. అమరచింత-ఏ, అమరచింత-బి, మస్తీపూర్, నాగల్‌కడ్మూర్, నందిమళ్ల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు ఒక్కొక్కరి చొప్పున ఏఎస్‌ఎంలు ఉన్నారు. కాగా డీఎంఆర్‌ఎం ఆస్పత్రి నేటికీ తిపుడంపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉండటంతో వాటికి వచ్చే నిధులు కొంత మేర అమరచింత ఆస్పత్రికి తరలించడం, మందులను సరఫరా చేయడం, ఏఎన్‌ఎంలను కేటాయించడంతోనే కాలం వెళ్లదీస్తున్నారే తప్పా స్వతంత్రంగా పీహెచ్‌సీగా ప్రకటించడం లేదు.

వేధిస్తున్న మందుల కొరత..

మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న రోగులకు సరఫరా చేసేందుకు సరిపడా మాత్రలు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేస్తున్న పరిస్థితులు దాపురించాయి. వీటికితోడు సూది మందులు కూడా అడిగితే ఇవ్వరని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆస్పత్రికి రెగ్యులర్ వైద్యుడు ఉండాలనే నిబంధన ఉన్నా.. పల్లె దవాఖానాలకు కేటాయించిన వైద్యులను కేటాయించి వైద్యసేవలు అందిస్తున్నారు.

కానరాని 108 వాహనం..

ఆస్పత్రికి ఏడాది కిందట 108 వాహనం మంజూరైంది. ఇక్కడ ఉండాల్సిన అంబులెన్స్ అత్యవసర పరిస్థితుల్లో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో సేవలు అందించడానికి వెళ్లి ప్రమాదానికి గురైంది. దీంతో మూడు నెలలుగా కనిపించడం లేదు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

వైద్యసేవలు మెరుగుపరుస్తాం..



డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం తిపుడంపల్లి పీహెచ్‌సీ సిబ్బందే పర్యవేక్షిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు మాత్రలతో పాటు అన్నిరకాల మందులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. సిబ్బంది నియామకం, వసతుల కల్పన తదితర అంశాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

– డా. శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ

బీపీ మాత్రలు లేవంటున్నారు..



ఆస్పత్రికి వెళ్లి బీపీ మాత్రలు అడిగితే లేవంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీ ప్రాంత ఏఎన్ఎంను అడిగి తీసుకోమని బదులిస్తున్నారు. అధికారులు స్పందించి అన్నిరకాల మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– రఘు, అమరచింత

సిబ్బంది కొరత..



ఆస్పత్రిలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. 108 వాహనం ప్రమాదానికి గురైనా మరమ్మతు చేయించడం లేదు. స్టాఫ్ నర్సు లేకపోవడంతో సూది మందులు సైతం ఇవ్వని పరిస్థితి ఉంది. – గీత, అమరచింత

హమాలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలి

టీయూసీఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ఆత్మకూర్: హమాలీలకు సమగ్ర చట్టం తీసుకొచ్చి అన్నివిధాలుగా ఆదుకోవాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతిరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త మార్కెట్ విధానంతో పనులు దొరకక హమాలీలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చట్టాల సవరణ పేరిట కార్మికవర్గాన్ని బానిసలుగా మార్చాలని చూస్తోందని, కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీచేస్తూ కార్మికులకు మొండి చెయ్యి చూపుతోందని మండిపడ్డారు. హక్కుల కోసం పోరాడుతున్న రైతులు, కార్మికులపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. హమాలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు వేతన చట్టాన్ని అమలు చేయాలని, విశ్రాంతి గదులు కేటాయించడంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లూథర్, ఉపాధ్యక్షుడిగా మోహన్, ప్రధానకార్యదర్శిగా జైపాల్, సహాయకార్యదర్శిగా అమర్, కోశాధికారిగా యాకూబ్, సభ్యులుగా మహేష్, దావీదు, వెంకటేష్, బలరాంల ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు హన్మంతు, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మహమ్మదాబాద్: ఇంటి ముందు బాత్రూం వద్ద అనుమానాస్పద స్థితిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. గండేడ్ మండలంలోని పంచలింగాల్‌తండాకు చెందిన లావుడ్యా రఘువీర్(26) తల్లిదండ్రులు పుణెలో ఉంటుండగా.. రఘువీర్ మాత్రం తండాలోనే ఒంటరిగా ఉంటూ ఇంటి పనులు చేసుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రివేళలో ఇంటి దగ్గర నిద్రించిన ఆయన తెల్లవారుజామున ఇంటి ముందు బాత్‌రూం దగ్గర బోర్లపడి ఉన్నాడు. తన మేనత్త సుశీల చూసి విషయం తండావాసులకు తెలిపింది. అయితే రఘువీర్ అనుమానాస్పదంగా మృతిచెంది ఉండటంతో అతని బావ పాండునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించి క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించినట్లు పోలీసులు చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడు..

వెల్దండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తంపల్లి గ్రామానికి చెందిన అల్లం రవికుమార్(32) ఈనెల 22న అత్తగారి గ్రామం కల్వకుర్తి మండలంలోని యంగంపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొట్రగేట్ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడి తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అతని భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన రాములు (45) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకోగా శుక్రవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం రాములు ఆస్తమాతో బాధపడుతుండగా.. కొద్ది రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాములు భార్య మశమ్మ, నలుగురు సంతానం ఉన్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

కోస్గి రూరల్: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు చెన్నారం గ్రామానికి చెందిన కుక్కల పెద్ద చెన్నప్ప (52) కుటుంబ విషయంలో భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ నెల 24న మరోమారు గొడవపడి ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారి సహాయంతో ప్రైవేట్ వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించాడు. మృతుడి కుమారుడు కుక్కల కేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

కుక్కల దాడిలో 25 గొర్రెపిల్లల మృతి



మహమ్మదాబాద్: ఊరకుక్కల దాడిలో 25 గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్ మండలంలోని మొకర్లాబాద్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మొకర్లాబాద్ గ్రామానికి చెందిన గొల్ల సాయిలు గొర్రెలు పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే తరుణంలో శుక్రవారం మధ్యాహ్నం గొర్రెలను పొలం వద్ద మంద కాడి నుంచి తీసుకుని వెళ్లి, గొర్రె పిల్లలను మాత్రం అక్కడే ఉంచి వాటికి రక్షణగా ఇనుప జాలి కట్టి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో వాటిపై ఊర కుక్కలు దాడి చేసి 25 గొర్రె పిల్లలను చంపేశాయి. దీంతో సాయంత్రం గొర్రెల కాపరి సాయిలు వెళ్లి చూడగా గొర్రె పిల్లలను చంపిన కుక్కలు అక్కడే జాలిలో ఉన్నాయి. కోపోద్రిక్తులైన కాపరులు కుక్కలను చంపేశారు. పేద రైతు అయిన సాయిలుకు చెందిన 25 గొర్రెపిల్లలు మృతిచెందడంతో సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఉత్సాహంగా సీఎంకప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- పాల్గొన్న పురుషుల, మహిళా జిల్లాల జట్లు
- శుభారంభం చేసిన పాలమూరు మహిళా జట్టు
- విజయం సాధించిన గద్వాల, నాగర్‌కర్నూల్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీని ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా ప్రారంభించారు. మెయిన్ స్టేడియంలోని మల్టీపర్పస్ ఇండోర్‌లో నాలుగు మ్యాట్‌లలో కబడ్డీ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ముందుగా మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా క్రీడాశాఖ అధికారులు, క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, డీఎస్‌ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పాపారాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, బాల్‌రాజు, విలియం, గజానంద్‌కుమార్, జగన్‌మోహన్‌గౌడ్, వడ్డెన్న, నిరంజన్, జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, రిటైర్డ్ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్-వనపర్తి పురుషుల విభాగం కబడ్డీ మ్యాచ్

శుభారంభం చేసిన మహిళా జట్టు

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో 33 జిల్లాల పురుషుల, మహిళా జట్లు పాల్గొన్నాయి. పాలమూరు జిల్లా మహిళా జట్టు శుభారంభం చేసింది. మహబూబ్‌నగర్ జట్టు 57-9 పాయింట్ల తేడాతో మంచిర్యాల జట్టుపై విజయం సాధించింది. ఉమ్మడి జిల్లాలోని గద్వాల జట్టు 55-12 తేడాతో యాదాద్రి భువనగిరి జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 41-4 తేడాతో మెదక్ జట్లపై గెలుపొందాయి. ఇతర మహిళా విభాగం మ్యాచుల్లో నల్గొండ జట్టు 70-18 పాయింట్ల తేడాతో నిజామాబాద్‌పై, రంగారెడ్డి జట్టు 50-7 తేడాతో సిద్దిపేటపై, హైదరాబాద్ జట్టు 49-18 తేడాతో నారాయణపేట జట్టుపై, మహబూబాబాద్ జట్టు 30-26 తేడాతో ఖమ్మం జట్టుపై, సంగారెడ్డి జట్టు 50-10 తేడాతో పెద్దపల్లి జట్టుపై, మేడ్చల్ జట్టు 34-20 తేడాతో కామారెడ్డి జట్లపై విజయం నమోదు చేసుకున్నాయి.

టోర్నీలో సత్తాచాటుతాం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో అతిథ్య జిల్లా పురుషుల, మహిళా జట్టు క్రీడాకారులు సత్తాచాటుతామంటున్నారు. వారిలో కొంతమంది మొదటిసారిగా, మరికొంతమంది రెండోసారి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు క్రీడాకారులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

పురుషుల విభాగం మ్యాచ్‌లు

పురుషుల విభాగం రంగారెడ్డి జట్టు 45-32 పాయింట్ల తేడాతో మేడ్చల్ జట్టుపై, కొత్తగూడెం జట్టు 23-16 తేడాతో సూర్యాపేట జట్టుపై, నల్గొండ జట్టు 35-15 తేడాతో సిరిసిల్ల జట్టుపై, గద్వాల జట్టు 44-15 తేడాతో నిర్మల్ జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 28-17 తేడాతో జగిత్యాల జట్టుపై, హైదరాబాద్ జట్టు 41-15 తేడాతో కామారెడ్డి జట్టుపై, కరీంనగర్ జట్టు 27-11 తేడాతో వరంగల్ జట్టుపై, ములుగు జట్టు 48-26 తేడాతో మెదక్ జట్టుపై, వనపర్తి జట్టు 38-10 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై, నిజామాబాద్ జట్టు 24-15 తేడాతో భూపాలపల్లి జట్టుపై గెలుపొందాయి.

టోర్నీలో గెలుపే ధ్యేయంగా ఆడుతాం..



దాదాపు 10 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఒకసారి జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. రెండోసారి సీఎం కప్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. టోర్నీలో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడమే ధ్యేయంగా ఆడుతాం.

– షేక్ మొయిజ్, మహబూబ్‌నగర్

రైట్ రైడర్‌గా ప్రతిభ చాటుతా



కబడ్డీ అంటే చాలా ఇష్టం. ఐదేళ్ల నుంచి కబడ్డీ ఆడుతున్న. జిల్లాలో సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణ బాగుంది. జిల్లా జట్టులో రైట్ రైడర్‌గా ఉన్న. రైడర్‌గా ఎక్కువ పాయింట్లు సాధించి జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తా.

– కౌషిక్, మహబూబ్‌నగర్

ఏడేళ్లుగా కబడ్డీ ఆడుతున్న



13 అంతర్‌జిల్లా రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించా. ఐదు జాతీయ స్థాయి టోర్నీలు ఆడాను. రెండోసారి రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీలో పాల్గొంటున్న. రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్టు తమ ప్రతిభ కనబరుస్తుంది.

– సంగీత, మహబూబ్‌నగర్

చాలా సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీ జిల్లాలో నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. టోర్నీలో ఏర్పాట్లు బాగున్నాయి. టోర్నీలో సమష్టిగా ఆడి జిల్లా జట్టును చాంపియన్‌గా నిలుపుతాం.

– శిరీష, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్-ఆదిలాబాద్ మహిళా విభాగం మ్యాచ్



గద్వాల-యాదాద్రి భువనగిరి జట్ల మహిళా విభాగం మ్యాచ్

గర్భిణి మృతిపై విచారణ



ప్రైవేటు ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ నెల 25న గర్భిణి మృతిచెందిన ఘటనపై డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి శుక్రవారం విచారణ చేపట్టారు. తెలకపల్లి మండలం ఆలేరు గ్రామానికి చెందిన గర్భిణి రాములమ్మ మృతికి ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ గర్భిణి రాములమ్మ చికిత్స పొందిన రాఘవేంద్ర, గాయత్రి ఆస్పత్రుల్లో విచారణ నిర్వహించారు. గర్భిణి ఆస్పత్రికి వచ్చిన సమయంతోపాటు చేసిన పరీక్షలు.. అందించిన వైద్యసేవల గురించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు అందించారు. ఆమె వెంట డీపీఓ రేణయ్య, హెచ్‌ఈఓ నిరంజన్ తదితరులున్నారు.

విజయ డెయిరీ నూతన కార్యవర్గం ఎన్నిక



జడ్చర్ల: మహబూబ్‌నగర్ మిల్క్‌షెడ్ విజయ డెయిరీ జిల్లా నూతన కార్యవర్గాన్ని శక్రవారం జిల్లా కార్యాలయంలో ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ మిల్క్ షెడ్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పాలశీతలీకరణ కేంద్రాల అధ్యక్షులు, బీఎంసీయూ అధ్యక్షులు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ మిల్క్ షెడ్ జిల్లా అధ్యక్షుడిగా మిడ్జిల్ బీఎంసీయూ అధ్యక్షులు ఎస్.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంసీసీ వనపర్తికి చెందిన సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎంసీసీ మహబూబ్‌నగర్‌కు చెందిన వెంకటరాంరెడ్డి, కోశాధికారిగా బీఎంసీయూ పెద్ద ఆదిరాల అధ్యక్షుడు రాంలింగారెడ్డి, సహాయ కార్యదర్శిగా బీఎంసీయూ జడ్చర్ల అధ్యక్షురాలు సువర్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో కోతుల బీభత్సం



బాలుర ఉన్నత పాఠశాల గదిలో బియ్యం, రాగిమాల్ట్‌ను చిందర వందర చేసిన కోతులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బస్తా బియ్యం, 2 బస్తాల రాగి మాల్ట్, 2 బస్తాల బెల్లం కోతుల పాలయ్యాయి. పాఠశాలకు వరుసగా మూడు రోజుల పాటు క్రిస్మస్ సెలవులు రావడంతో పాఠశాల గదులు మూసుకొని ఉన్నాయి. సామగ్రి ఉన్న కిటికీ తలుపులు సక్రమంగా లేకపోవడంతో అందులో నుంచి గదిలోకి వచ్చిన కోతులు అందులో ఉన్న బియ్యం, రాగిమాల్ట్, బెల్లం తినడంతో పాటు చిందరవందర చేశాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియపర్చడంతో వారు శుక్రవారం వచ్చి గదిలో ఉన్న కోతులను బయటకు తరిమారు. గది కిటికి తలుపులు సక్రమంగా ఉన్న వాటిలో భద్రపర్చాల్సిన సామగ్రిని తలుపులు సక్రమంగా లేని గదిలో ఉంచడంతో వస్తువులు కోతుల పాలు అయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎంఈఓ శ్రీనివాసులను వివరణ కోరగా.. పాఠశాలకు వరుసగా సెలవులు రావడం, కిటికి తలుపులు సక్రమంగా లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని, మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



శ్రీశైలం ప్రధాన రహదారిలో ప్రమాదానికి గురైన కారు

మన్ననూర్: శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారి అటవీ సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరాఖండ్‌కు చెందిన కారు శ్రీశైలం వైపు వెళ్తుండగా.. హైదరాబాద్‌కు చెందిన కారు శ్రీశైలం నుంచి మన్ననూర్ వైపు వస్తుంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మన్ననూర్‌కు 3 కిలో మీటర్ల దూరంలో రెండుకార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఉత్తరాఖండ్‌కు చెందిన కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు రెండు కార్లను అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై ఎస్‌ఐ రజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రామకృష్ణగౌడ్ ఉన్నారు.

మందా జగన్నాథంకు పరామర్శ



మందా జగన్నాథంను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అలంపూర్: మాజీ ఎంపీ మందా జగన్నాథంను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆస్పత్రికి చేరుకొని ఆయన పరామర్శి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. మందా కుమారుడు మందా శ్రీనాథ్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. అదేవిధంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వేర్వేరు సమయాల్లో ఆస్పత్రికి చేరుకొని మాజీ ఎంపీని పరామర్శించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన బాలకృష్ణ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాలోని హన్వాడ మండలం రామన్నపల్లికి చెందిన జె.బాలక్రిష్ణ మెరుగైన ప్రతిభ కనబరిచాడు. 67 కేజీల కేటగిరిలో స్నాచ్‌లో 95 కేజీ, క్లీన్ అండ్ జర్క్‌లో 120 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, కోచ్ ఎన్.చంద్రశేఖర్‌గౌడ్, మేనేజర్ అఫ్రోజ్ అభినందించారు.

6,286 క్యూసెక్కుల నీటి తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 6,286 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,519, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.761 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.0 అడుగుల వద్ద 112.2100 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడులో శుక్రవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 640 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 880 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

చోరీకి గురైన సొత్తు స్వాధీనం

గోపాల్‌పేట: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే పోయిన వస్తువులు వెంటనే గుర్తించే అవకాశం ఎక్కువగా ఉంటుందని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రామస్వామి ఆయన భార్య గురువారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో మండల కేంద్రంలోని ఓ కల్లు దుకాణంలో కల్లు తాగి వెంట తెచ్చుకున్న రూ.70వేల ఉన్న సంచిని అక్కడే వదిలి వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత డబ్బులున్న సంచి కల్లు దుకాణంలో మరిపోయామని గుర్తించి, అక్కడికి వెళ్లి చూడగా డబ్బులున్న సంచి కనిపించలేదు. దీంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించి ఓ వ్యక్తి బ్యాగు తీసుకెళ్లాడని గుర్తించి అతడితో మాట్లాడి డబ్బును శుక్రవారం బాధితులకు అప్పగించారు. వీధులు, ప్రధాన రోడ్లు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఏవైనా ప్రమాదాలు, చోరీలు ఇతర ఘటనలు జరిగినప్పుడు ఉపయోగపడతాయని, సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు.

మర్రి జనార్దన్‌రెడ్డికి పరామర్శ



మర్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌రావు

తిమ్మాజీపేట: మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పలువురు ప్రముఖులు శుక్రవారం పరామర్శించారు. మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్వగ్రామం నేరేళ్లపల్లికి వెళ్లి జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రావుల శ్రీధర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్‌జీ, నాయకులు మారేడు శివశంకర్, కేశముల్ల శివకృష్ణ, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నిందితులకు రిమాండ్


గద్వాల క్రైం: వ్యభిచార కార్యకాలాపాలు నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గద్వాల మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన వరుణ్ (తిరుమలేష్), గద్వాల పట్టణానికి చెందిన వెంకీలు పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి వ్యభిచారం కార్యకాలాపాలను నిర్వహిస్తున్నారు. అందుకున్న సమాచారం మేరకు గురువారం సాయంత్రం వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేసి ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు విటులు, ఓ యువతిని అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాయగూరల విత్తనోత్పత్తిలో మెళకువలు

పాడి-పంట



డా. పిడిగెం సైదయ్య, అసోసియేట్ డీన్, మోజర్ల ఉద్యాన కళాశాల



కొత్తకోట రూరల్: పంటల సాగులో నాణ్యమైన విత్తనానిదే ప్రధాన పాత్ర. నాణ్యమైన విత్తనం నాటితే సగం దిగుబడి సాధించినట్లే. సాగులో వినియోగించే ఎరువులు, నీరు, ఇతర ఉత్పత్తి కారకాల సామర్థ్యం విత్తనం నాణ్యతపైనే ఆధారపడి ఉంటుంది. సిఫార్సు చేసిన విత్తన మొలక శాతం, తేమ, భౌతిక, జన్యు స్వచ్ఛత కలిగిన విత్తనాలు వాడాలి. అప్పుడే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చు.

■ మార్కెట్లో కాయగూరల విత్తనాలు లభ్యమవుతున్నా.. వాటి నాణ్యత్వపై అంతగా భరోసా లేదు. కాబట్టి రైతులు తమస్థాయిలో తక్కువ ఖర్చుతో తగిన మోతాదులో విత్తనాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చు. కాని అన్ని కాయగూరల పంటల్లో విత్తనోత్పత్తి సాధ్యం కాదు. టమాటా, వంకాయ, మిరపతో పాటు తీగజాతి పంటలు, గోరుచిక్కుడు, తోటకూర మొదలైన ఉష్ణ ప్రాంతపు పంటల్లో మాత్రమే విత్తనోత్పత్తి సాధ్యం. చలికాలం పంటలైన క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితర పంటల విత్తనోత్పత్తి మన ప్రాంతంలో సాధ్యం కాదు. విత్తనోత్పత్తి చేపట్టే ప్రాంతంలో పరిస్థితులు విత్తన నాణ్యతపై ప్రభావం చూపుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న ప్రాంతాలు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు విత్తనోత్పత్తికి పనికిరావు. విత్తనోత్పత్తి ప్రాంతంలో పగలు సూర్యరశ్మి కనీసం 10 నుంచి 12 గంటలు ఉండాలి. ముఖ్యంగా కాయలు కోత కొచ్చే సమయంలో వర్షాలు రాకుండా ముందుగానే విత్తనాలు పొలంలో వేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

విత్తనోత్పత్తి చేసే ముందు కొన్ని అంశాల్లో జాగ్రత్తలు పాటించాలి. మొదట నిర్ణయించుకున్న అధీకృత డీలరు లేదా పరిశోధనా స్థానం నుంచి ఫౌండేషన్ విత్తనం సేకరించుకోవాలి. రెండోది విత్తన దూరం పాటించాలి. ఒక్క టమాటాలో తప్పితే చాలాపంటల్లో తరచూ పరపరాగ సంపర్కం లేదా పూర్తిగా పరపరాగ సంపర్కం జరుగుతుండటంతో విత్తనంలో కల్తీలు ఏర్పడి నాణ్యత తగ్గుతుంది. కావున వేర్పాటు దూరం కచ్చితంగా పాటించాలి. వేర్పాటు మూడు రకాలుగా ఉంటుంది. విత్తనోత్పత్తి చేపట్టే ఒక పంట వేసిన తర్వాత కనీసం 20 నుంచి 25 రోజుల తర్వాత వేరే విత్తన పంట వేసుకోవాలి. అప్పుడు కల్తీ ఉండదు. అది సాధ్యం కాకపోతే సిఫార్సు మోతాదులో వేర్పాటు దూరం పాటించాలి. మూల విత్తనం, బ్రీడర్ విత్తనం, ఫౌండేషన్ ధ్రువీకరణ విత్తనం ఉత్పత్తిలో ధ్రువీకరణ విత్తన ఉత్పత్తిని మాత్రమే రైతులు చేపట్టవచ్చు.

తీగజాతి కూరగాయలు..

కాకర, గుమ్మడి, బూడిద గుమ్మడి, దోస రకాల్లో వాటి పండ్లరంగు, కాడ రంగు, తీగలు ఎండిపోవడాన్ని బట్టి పక్వానికి వచ్చాయని నిర్ధారించుకోవచ్చు. పండిన పండ్లను కోసి చేతితో విత్తనాన్ని వేరు చేసి సేకరించుకోవాలి. తర్వాత నీటితో కడిగి ఆరబెట్టుకోవాలి. ఎకరా పంట నుంచి 120 నుంచి 320 కిలోల విత్తనం పొందవచ్చు. అన్ని కాయగూరల విత్తనోత్పత్తికి కోత అనంతరం పండ్లను 5 నుంచి 7 రోజులు నిల్వ ఉంచినట్లయితే విత్తనం బాగా అభివృద్ధి చెంది నాణ్యంగా ఉంటుంది.